క్లుప్తంగా

కరాటే పోటీల్లో పతకాలు

ఏలూరు రూరల్ : మహారాష్ట్రలో జరిగిన అంతర్జాతీయ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో ఏలూరు కరాటే సాధకులు 18 పతకాలు సాధించారని కోచ్ డీఎల్ నారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. జపాన్ గ్రాండ్ మాస్టర్ కోచి యమమ్మురా, కింటోరా యమమ్మురా ఆధ్వర్యంలో మే నెలాఖరులో ఈ పోటీలు నిర్వహించినట్టు వెల్లడించారు. ఈ పోటీల్లో పాల్గొన్న ఏలూరు కరాటే సాధకులు డి.చైతన్య రెడ్డి 1 వెండి, 1 రజత, డి.నందీశ్వర్‌రెడ్డి 1 బంగారు, 1 వెండి, మోహిత్ సత్యసాయి 1 వెండి, 1 కాంస్యం, పి.భూపతి 2 వెండి, ఎ.యశస్విని 2 బంగారు, ఎండి మోహరున్నీసా 1 రజతం, బాలాజీరామచంద్ర 2 రజతాలు, ఎ.వైభవ్ బాలాజీ 1 వెండి, 1 రజతం, ఎన్ రాజు 1 రజతం, వేదాంత 2 రజత పతకాలు సొంతం చేసుకున్నారని వివరించారు. విజేతలను కనిన్‌జూ కరాటే అసోసియేషన్ సభ్యులు అభినందించారని పేర్కొన్నారు.

కౌంటింగ్ ప్రక్రియలో నిబంధనలు పాటించాలి

దెందులూరు: దెందులూరు నియోజకవర్గ కౌంటింగ్‌కు సంబంధించి ఈ నెల 4వ తేదీన ఉదయం 6 గంటలలోపు గుర్తింపు కార్డులతో ఏజెంట్లు, చీఫ్ ఏజెంట్లు ఏలూరు సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో హాజరుకావాలని జిల్లా జాయింట్ కలెక్టర్, దెందులూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి బి.లావణ్యవేణి అన్నారు. నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీల చీఫ్ ఏజెంట్లు, ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. కౌంటింగ్ రోజున 144సెక్షన్, సెక్షన్ 30 అమలులో ఉన్నందున ఊరేగింపులు, ర్యాలీలు, సభలు, బాణ సంచా కాల్చరాదన్నారు. కౌంటింగ్ రోజున మద్యం విక్రయాలు నిషేధమన్నారు. సిబ్బందితో సహా ఏజెంట్లు, చీఫ్ ఏజెంట్లు సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురాకూడదన్నారు. కౌంటింగ్ పూర్తయిన తరువాత కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాడ్లు సీజ్ చేసి జిల్లా ఎన్నికల స్ట్రాంగ్ రూమ్‌లో అప్పగించాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియలో నిబంధనలపై జాయింట్ కలెక్టర్ ఏజెంట్లకు అవగాహన కల్పించారు. సమావేశంలో దెందులూరు తహసీల్దార్ వీ.జితేంద్ర, దెందులూరు ఎంపీడీఓ పీ.శ్రీలతతో పాటు నాలుగు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

నియమావళిని పాటించాలి

గణపవరం(ఉంగుటూరు): ఎన్నికల నియమావళిని ఖచ్చితంగా పాటిస్తూ, కౌంటింగ్ సందర్భంగా ప్రజలు రాజకీయాలకు అతీతంగా సామరస్యంతో మెలగాలని నిడమర్రు సీఐ ఎంవీ సుభాష్ అన్నారు. శనివారం ఉంగుటూరులో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు లెక్కింపు సందర్భంగా గ్రామాలలో అవగాహన సమావేశాలు నిర్వహించారు. ప్రజలు ఆవేశ కావేశాలకులోను కాకుండా సంయమనం పాటించాలని సూచించారు.

72 ఏళ్ల చరిత్ర.. రెండే మంత్రి పదవులు

- జిల్లా కేంద్రమైనా ఏలూరు నియోజకవర్గానికి మొండి చెయ్యే
- వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తే మరో సారి మంత్రి పదవి !



ఏలూరు (ఆర్ఆర్‌పేట) : ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గానికి 72 ఏళ్ల చరిత్ర ఉంది. ఇక్కడ 1952వ సంవత్సరం నుంచి ఇప్పటి వరకూ 15 సార్లు ఎన్నికలు జరిగాయి. ఉమ్మడి రాష్ట్రంలో ఎక్కువ కాలం పాలించిన కాంగ్రెస్, టీడీపీ పార్టీలు ఏలూరు నియోజకవర్గానికి మంత్రివర్గంలో ప్రాతినిధ్యం కల్పించలేదు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాగా ఉన్న సమయంలో జిల్లా కేంద్రంగా ఉన్న ఏలూరుకు రాజకీయంగా తగిన ప్రాధాన్యత లభించలేదు. ఎంతో మంది ఉద్దండులు ఎమ్మెల్యేలుగా గెలిచి అసెంబ్లీలోకి అడుగు పెట్టినా వారికి మంత్రి పదవులు కేటాయించడానికి ఆయా పార్టీల ముఖ్యమంత్రులు వెనుకడుగు వేశారనే చెప్పాలి.

రెండే మంత్రి పదవులు

ఏలూరు నియోజకవర్గానికి ఇప్పటి వరకు కేవలం రెండే మంత్రి పదవులు దక్కాయి. వీటిలో ఒకటి నియోజకవర్గం ఏర్పడిన 42 ఏళ్ల తరువాత మంత్రి మండలిలో ప్రాతినిధ్యం లభించింది. అనంతరం మరో మంత్రి పదవి లభించడానికి మరో పాతికేళ్లు పట్టింది. మరడాని రంగారావుకు 1994లో నాటి ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు తన క్యాబినెట్లో స్థానం కల్పించారు. రంగారావు సాంకేతిక విద్యా శాఖమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఐతే ఆయన పదవి మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలింది. చంద్రబాబు నాయుడు పొడిచిన వెన్నుపోటు కారణంగా ఎన్‌టీ రామారావు పదవీచ్యుతుడు కావడం, అనంతరం చంద్రబాబు క్యాబినెట్ ఏర్పాటు చేసినా ఎన్‌టీ రామారావు అనుకూలునిగా భావించి మరడాని రంగారావుకు తన మంత్రివర్గంలో స్థానం కల్పించకపోవడంతో రంగారావు కేవలం తొమ్మిది నెలలు మాత్రమే మంత్రిగా పని చేశారు. అనంతరం తన మంత్రి పదవిని కోల్పోయారు.

ప్రాధాన్యత ఇచ్చిన జగన్

2019వ సంవత్సరంలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏలూరు నియోజకవర్గంపై తనకున్న అవ్యాజమైన ప్రేమతో మంత్రి పదవి కేటాయించారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి మరణించిన తరువాత జగన్ ఓదార్పు తన యాత్రను ఏలూరు నుంచే ప్రారంభించగా, ఆ సమయంలో నియోజకవర్గ ప్రజలు ఆయనను అక్కున చేర్చుకుని ఆదరించారు. దీనికి కృతజ్ఞతగా రాజకీయాల్లో ఎంతో అనుభవం ఉన్న ఎమ్మెల్యే ఆళ్ల నానికి ఉప ముఖ్యమంత్రి పదవితో పాటు అత్యంత కీలకమైన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి పదవిని కట్టబెట్టారు. నాని కరోనా విపత్తు సమయంలో అవిశ్రాంతంగా పని చేసి కరోనా మహమ్మారి నుంచి రాష్ట్ర ప్రజలను కాపాడడంలో తనవంతు బాధ్యత నిర్వర్తించారు.

వైఎస్సార్ సీపీతోనే మరోసారి మంత్రి పదవి

ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడితే ఏలూరుకు మరోసారి మంత్రివర్గంలో స్థానం ఖాయమని ప్రజలు విశ్వసిస్తున్నారు. నానికి మంత్రి పదవి ఇస్తే ఆ పదవికి వన్నె తెస్తారని సీఎం జగన్‌లో అపారమైన విశ్వాసం ఉంటుందని, ఈ మేరకు మరోసారి నానికి మంత్రి పదవి దక్కుతుందని ఇక్కడి ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో నాని చేసిన అభివృద్ధి, ఆయనకు ముందు చేసిన ఏ నాయకుడూ చేయలేదని, ఆయన తరువాత కూడా ఏ నాయకుడూ చేయలేదని గణాంకాలు చెబుతున్నాయి. ముఖ్యమంత్రి జగన్‌కు, ఈ నియోజకవర్గ ప్రజలకు ఉన్న విడదీయరాని అనుబంధం మేరకు మంత్రివర్గంలో తగిన ప్రాధాన్యతే లభిస్తుందని చర్చించుకుంటున్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమంతునికి పూజలు





దత్తక్షేత్రం కార్యసిద్ధి ఆంజనేయ స్వామి, పవర్‌పేట కోదండ రామాలయంలోని హనుమంతుడు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): హనుమద్ జయంతి పర్వదినం సందర్భంగా శనివారం నగరంలోని వివిధ ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. దొండపాడు శ్రీ నం దత్తనాథ క్షేత్రంలో కార్యసిద్ధి ఆంజనేయ స్వామి దేవస్థానంలో 24వ వార్షిక హనుమద్ జయంతి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 7 గంటలకు స్వామి వారికి ఏకాదశ వార మన్యుసూక్త సంపుటిత రుద్రాభిషేకం, 9 గంటలకు భక్తులచే ఉత్సవ మూర్తులకు అభిషేకం, విశేష అలంకరణ, అనంతరం కదళీఫల అర్చన చేసి, స్వామి వారికి 108 వడమాలలు సమర్పించారు. స్వామి వారికి విశేష అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం లక్ష్మీ గణపతి, నవగ్రహ, మృత్యుంజయ సహిత మన్యుపాశుపత హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. రాత్రి స్వామి వారికి విశేష పల్లకి సేవ, మల్లె పూలతో పుష్పార్చన, హారతులు, నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు భక్తులు హనుమాన్ చాలీసా పారాయణ నిర్వహించారు. క్షేత్రం అర్చకులు ప్రతాప కృష్ణ కిషోర్ శర్మ విశేష పూజలు చేయగా, క్షేత్రం వ్యవస్థాపక ట్రస్టీ వేణుగోపాల్ లునాని, కార్యదర్శి కాకి బాబు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

పవర్ పేటలోని బడేటి వారి వీధి కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 8 గంటలకు స్వామి వారికి పంచామృతాలతో, పండ్ల రసాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. 108 మామిడి పండ్లతో పూజ చేసి సింధూర, తమలపాకు పూజలు చేశారు. సమస్రనామ పూజ చేసి స్వామి వారికి విశేష అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు.

స్వాగతం పలుకుతున్న సీసీ రోడ్లు

- ఏలూరు కార్పొరేషన్ విలీన గ్రామాల్లో రోడ్ల అభివృద్ధి
- పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత



వెంకటాపురంలో సీసీరోడ్డు



చొదిమెళ్లలో కొత్త సీసీరోడ్డు



కొమడవోలులో అభివృద్ధి చేసిన గ్రావెల్ రోడ్డు

ఏలూరు రూరల్ : ఏలూరు నగర కార్పొరేషన్ విలీన గ్రామాల్లో సీసీ రోడ్లు స్వాగతం పలుకుతున్నాయి. ప్రధాన కూడళ్లతో పాటు శివారు ప్రాంతాల్లో పేదల నివాసాల ముందు విశాలమైన సిమెంట్ రోడ్లు కనువిందు చేస్తున్నాయి. గతంలో ఏ ఇంటి ముందు చూసినా బురదరోడ్లు దర్శనమిచ్చేవి. కూడళ్ల వద్ద రోడ్లపై గోతులు భయపెట్టేవి. బురదనీరు నిండిన రోడ్లు వాహనదారులు పడిన ఇబ్బందులు వర్ణనాతీతం. ఇప్పుడు అదంతా గతం. గ్రామాల్లో రోడ్లు నగరాలకు దీటుగా రూపుదిద్దుకున్నాయి. ఇందిరమ్మ కాలనీల్లో సైతం సీసీ రోడ్లు దర్శనమిస్తున్నాయి. ఐదేళ్ల క్రితం వరకు గ్రామాల్లో రోడ్లు అభివృద్ధి అంతంత మాత్రంగానే ఉంది.

నూరు శాతం రోడ్ల నిర్మాణం

వెంకటాపురం, చొదిమెళ్ల, శనివారపుపేట, సత్రంపాడు, పోణంగి, కొమడవోలు, తంగెళ్లమూడి గ్రామాల్లో 100 శాతం పక్కా సీసీ రోడ్లు రూపుదిద్దుకున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మొత్తంగా 285 పనులు చేపట్టారు. రూ.51 కోట్లు వెచ్చించి సుమారు 97 కిలో మీటర్ల విస్తీర్ణంలో సీసీ రోడ్లు నిర్మించారు. రూ.45 కోట్లు ఖర్చు చేసి 120 కిలోమీటర్ల దూరం డ్రెయినేజీ వ్యవస్థను అభివృద్ధి చేశారు. కొత్తూరు ఇందిరమ్మకాలనీలో ఫేస్-1, ఫేస్-2లో మొత్తంగా 100 శాతం సీసీ రోడ్లు నిర్మించారు. కొమడవోలు ఇందిరమ్మ కాలనీలో సుమారు 15 కిలో మీటర్ల మేరకు సీసీ రోడ్లు నిర్మించడంతో పేదలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చొదిమెళ్లలో 10 రోడ్లను సీసీ రోడ్లుగా అభివృద్ధి చేశారు. ప్రధాన రోడ్డు విస్తరించి రెండు పక్కల డ్రెయినేజీ వ్యవస్థను అభివృద్ధి చేశారు.

బాగుపడిన రోడ్లు



గతంలో గోతులు రోడ్లు, కచ్చా డ్రెయిన్లతో అవస్థలు పడ్డాం. ఇప్పుడు నగర కార్పొరేషన్‌లో విలీనమయ్యాం. అధికారులు రోడ్లు నిర్మిస్తున్నారు. మా డివిజన్‌లో ఏ వీధి చూసిన సీసీ రోడ్లు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం అభివృద్ధి పనులు బాగా చేసింది. రాబోయేది వర్షాకాలం. రోడ్లపై మురుగునీరు నిలిచిపోకుండా డ్రెయినేజీని బాగు చేయాలి.

– వి.లీల, వెంకటాపురం

పరిసరాలు శుభ్రంగా ఉన్నాయి



కొన్నేళ్లుగా మా ఇంటి ముందు గ్రావెల్ రోడ్డు ఉండేది. వర్షాకాలం వస్తే బురదమయం అయ్యేది. మురుగులో నడవలేక చాలా ఇబ్బందులు పడ్డాం. కొంతకాలం క్రితం మా ఇంటి ముందు సీసీ రోడ్డు నిర్మించారు. చక్కగా రోజూ ఇంటి ముందు శుభ్రం చేసుకుంటున్నాం. ముగ్గులు పెట్టుకుంటున్నాం. పరిసరాలు పరిశుభ్రత పాటిస్తున్నాం.

– బి.సంజీవమ్మ, 15 డివిజన్

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	02
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	04
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.30	05
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	16.00	--
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	14

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	02
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21,.15	4822	04
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	01
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	02
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	02
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	01
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	04
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	01
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.20	98511	--
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.10	98503	--
ఏలూరు - తిరుపతి	16.00	4830	16

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	38	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	88
వంకాయలు (కాంతులు)	34	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	36	ములక్కాడలు	07, 10
బెండకాయలు	36	కంద	72
పచ్చిమిర్చి	88-96	బీట్‌రూట్	36
కాకర కాయలు	44-56	కీరా దోస	36
బీరకాయలు	54	ఫ్రెంచ్‌బీన్స్	--
బీరకాయలు (పందిరి)	76	అల్లం	170
క్యాబేజీ	30	కొత్తిమీర (కట్ట)	35
క్యారెట్	36-52	పాలకూర	15
దొండకాయలు	20	చుక్కకూర	15
బంగాళదుంపలు	34	తోటకూర	12
ఉల్లిపాయలు	30	గోంగూర	07
గోరుచిక్కుడు	60	పుదీనా	05
దోసకాయలు	36	బఠాణి	--
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	44

శాస్త్రీయ పద్ధతిలో ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ చేపట్టాలి



సదస్సులో జూట్ బ్యాగ్‌లను విడుదల చేస్తున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి, అధికారులు

ఏలూరు (టూటౌన్): శాస్త్రీయ పద్ధతిలో ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ చేపట్టాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి కేకేవీ బుల్లి కృష్ణ అన్నారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవన్‌లో ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ అంశంపై వివిధ అధికారులతో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కేకేవీ బుల్లి కృష్ణ మాట్లాడుతూ ఘన వ్యర్థ పదార్థాలు, ప్లాస్టిక్, బయో మెడికల్ మొదలైన వ్యర్థాల నిర్వహణ అనగా... సేకరించడం, పునరుత్పత్తి చేయడం, పూర్తి నిర్మూలనపై అందుబాటులో ఉన్న శాస్త్రీయతను వివరించారు. మున్సిపల్ అదనపు కమిషనర్ చంద్రయ్య మాట్లాడుతూ అందుబాటులోని వనరులను ఉపయోగించుకుంటూ వ్యర్థ పదార్థాలను సేకరించి, వాటి పునరుత్పత్తి చేస్తారని తెలిపారు. నగర ప్రజలు కూడా కార్పొరేషన్‌కు సహకరించాలని కోరారు. రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇంజినీర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వివిధ రకాల వ్యర్థాలను సేకరణ, పునరుత్పత్తి, శాశ్వత నిర్మూలన అంశాలపై ఉన్న శాస్త్రీయపరమైన విధి విధానాలను, వాటికి రూపొందించిన చట్టాలను వివరించారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ నాగరత్నం మాట్లాడుతూ వివిధ వ్యర్థాలను శాస్త్రీయపరంగా నిర్మూలించాలని, లేదా ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడతారని తెలిపారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ప్యానల్ న్యాయవాది కూన కృష్ణారావు మాట్లాడుతూ వ్యర్థపదార్థాలను సరైన రీతిలో ఉపయోగించటం ద్వారా ఆదాయ వనరులు సృష్టించవచ్చన్నారు. ఈ సందర్భంగా ఏపీ పొల్యూషన్ బోర్డు ఆధ్వర్యంలో జూట్ బ్యాగ్‌లను విడుదల చేసి, పంపిణీ చేశారు. కార్యక్రమంలో వివిధ ఆస్పత్రులు, పరిశ్రమలల ప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, పంచాయతీ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గణనీయంగా పెరిగిన విద్యుత్ వినియోగం

- సాంకేతిక సమస్యలతో సరఫరాకు అంతరాయం
- అధికారుల కృషితో మెరుగైన విద్యుత్ సేవలు



పెదవేగి విద్యుత్ సెక్షన్

పెదవేగి : వేసవి సీజన్‌లో విద్యుత్ వాడకం గణనీయంగా పెరిగింది. వేసవికి ముందు కన్నా ఈ సీజన్‌లో రెండు మెగావాట్ల విద్యుత్ వాడకం పెరిగింది. జూన్ రెండో వారం వరకు ఇదే పరిస్థితి కొనసాగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఏసీ వంటి విద్యుత్ ఉపకరణాల వినియోగం పెరగడంతో సరఫరాలో పది రోజులుగా తీవ్రమైన సాంకేతిక సమస్యలు ఏర్పడ్డాయి. వేసవి ప్రారంభంలో తరచూ విద్యుత్ సరఫరా నిలిచిపోవడం, ట్రిప్ అవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సవాళ్లను అధిగమించిన అధికారులు కొన్ని రోజుల నుంచి విద్యుత్‌ను సక్రమంగా అందిస్తున్నారు. ప్రతి మండలంలో కొన్ని గంటలు విద్యుత్ కోత అమల్లో ఉంటుందని చెబుతున్నారు. పెదవేగి మండల పరిధిలో మాత్రం విద్యుత్ కోత లేకుండా చేయడంలో అధికారులు సఫలమయ్యారు.

రెండు సెక్షన్ కార్యాలయాల పరిధిలో వినియోగం ఇలా...

మండలంలో జానంపేట సెక్షన్ కార్యాలయ పరిధిలో 13, పెదవేగి సెక్షన్ కార్యాలయ పరిధిలో 17 పంచాయతీలు ఉన్నాయి. జానంపేట విద్యుత్ స్టేషన్ పరిధిలో సాధారణంగా 20 మెగావాట్ల విద్యుత్ వినియోగం ఉండేది. ఏప్రిల్ 15 నుంచి ఆ వినియోగం ఎనిమిది మెగావాట్లకు చేరింది. పెదవేగి స్టేషన్ పరిధిలో 30 మెగావాట్ల వినియోగం ఉండగా ప్రస్తుతం 35 మెగావాట్లకు చేరింది. తరచూ ఏర్పడుతున్న సాంకేతిక సమస్యలను అధిగమించేందుకు లైన్ విడదీసి, కేబుల్, కండక్టర్లను మార్చారు. లో ఓల్టేజీ సమస్యకు రెండు సెక్షన్ స్టేషన్ల పరిధిలో 650 సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు, 600 త్రీఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. దీంతో వినియోగదారులకు మెరుగైన విద్యుత్‌ను అందించగలుగుతున్నట్లు అధికారులు తెలిపారు.

సమస్యలను పరిష్కరించాం



వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కరించాం. లో ఓల్టేజ్ సమస్య ఉన్న చోట ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశాం. సాంకేతికపరమైన సమస్యలను అధిగమించి వినియోగదారులకు మెరుగైన విద్యుత్‌ను అందించి, వారి మన్ననలు అందుకుంటున్నాం.

– కె.నాగేశ్వరరావు విద్యుత్‌శాఖ ఏఈ, పెదవేగి

ఏజెంట్లకు మద్యం నిర్ధారణ పరీక్షలు

దెందులూరు: కౌంటింగ్ రోజు లోపలికి వెళ్లే చీఫ్, ఏజెంట్లకు విధిగా మద్యం నిర్ధారణ పరీక్షలు చేస్తామని, మద్యం సేవించిన వారిని కౌంటింగ్ హాలులోకి అనుమతించమని ఏలూరు డీఎస్పీ, కౌంటింగ్ సెంటర్ ఇన్‌ఛార్జి (రక్షణ విభాగం) ఈ.శ్రీనివాసులు అన్నారు. శనివారం డీఎస్పీ మాట్లాడుతూ కౌంటింగ్ సెంటర్‌కు వచ్చేవారితో సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించమని చెప్పారు. కౌంటింగ్ అనంతరం రాజకీయ పార్టీలు వాట్సాప్ గ్రూపుల్లో విమర్శలు, దూషణలు చేయరాదని తెలిపారు. వాట్సాప్ గ్రూపుల్లోని పోస్టులకు ఆ గ్రూపు అడ్మినే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. కౌంటింగ్ సెంటర్ పరిధిలో సెక్షన్ 30, సెక్షన్ 144 అమలులో ఉంటాయన్నారు. ఈ నెల 6 వరకు ఇద్దరు లేదా ముగ్గురుకి మించి ప్రజలు గుమికూడరాదన్నారు.